


## సూర్యుడు

**మూలవాక్యము : లూకా 23 : 45** సూర్యుడు అదృశ్యుడాయెను; గర్భాలయపు తెర నడిమికి చినిగెను.

**ప్రవచనము : ఆమోసు 8 : 9** ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా – ఆ దినమున నేను మధ్యాహ్నకాలమందు సూర్యుని అస్తమింపజేయుదును. పగటివేళను భూమికి చీకటి కమ్మజేయుదును.

**ఈ ప్రవచనము యేసు ప్రభువు రెండవ రాకడను గూర్చి చెప్పబడినప్పటికి యేసు ప్రభువు మరణించినప్పుడు కూడ ఇది నెరవేరినదని జ్ఞాపకం చేస్తున్నాను.**

### సూర్యుని నిర్మించినది ఎవరు? దేని కొరకు నిర్మించారు? :

**కీర్తనలు 136 : 8 పగటి నేలుటకు** ఆయన సూర్యుని చేసెను ఆయన కృప నిరంతరముండును.

**యిర్మీయా 31 : 35 పగటి వెలుగుకై** సూర్యుని, రాత్రి వెలుగుకై చంద్ర నక్షత్రములను నియమించువాడును, దాని తరంగములు ఘోషించునట్లు సముద్రమును రేపువాడునగు యెహోవా ఆ మాట సెలవిచ్చుచున్నాడు, సైన్యముల కధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు.

**కీర్తనలు 19 : 4** వాటి కొలనూలు భూమియందంతట వ్యాపించి యున్నది లోకదిగంతములవరకు వాటి ప్రకటనలు బయలువెళ్లుచున్నవి వాటిలో ఆయన సూర్యునికి గుడారము వేసెను.

### సూర్యుడు ఎవరి ఆధీనములో ఉన్నాడు? :

**1. యోబు 9 : 7** ఉదయింపవద్దని ఆయన సూర్యునికి ఆజ్ఞాపింపగా అతడు ఉదయింపడు ఆయన నక్షత్రములను మరుగుపరచును.

**2. మత్తయి 5 : 45** ఆయన చెడ్డవారిమీదను మంచివారిమీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతుల మీదను, అనీతిమంతులమీదను వర్షము కురిపించుచున్నాడు.

* **పై లేఖనాలు మనకు ఏమి నేర్పిస్తున్నాయి అంటే సూర్యుడు దేవుడు కాదని, సూర్యుని నిర్మించిన దేవుడు ఉన్నాడని, సూర్యుని నిర్మించటం వెనుక దేవునికి ఒక ఉద్దేశం కలదని మనకు అర్థమౌతుంది.**

### దేవుడు సూర్యుని ఎలా నిర్మించాడు ? :

**1. పరమ 6 : 10** సంధ్యారాగము చూపట్టుచు చంద్రబింబమంత అందముగలదై సూర్యుని అంత **స్వచ్ఛమును కళలునుగలదై** వ్యూహితసైన్య సమభీకర రూపిణియునగు ఈమె ఎవరు?

**2. ప్రసంగి 11 : 7** వెలుగు మనోహరమైనది, సూర్యుని చూచుట **కన్నుల కింపుగా** నున్నది.

**సూర్యుని వలన కలుగు ప్రయోజనాలు : శ్రేష్ఠ పదార్థములు లభించును : ద్వితి 33 : 14** సూర్యునివలన కలుగు ఫలములోని శ్రేష్ఠపదార్థములవలన చంద్రుడు పుట్టించు శ్రేష్ఠపదార్థములవలన...

Ex : Vitamin – D ,మానవులకు ఆరోగ్యం, మొక్కలకు ఆరోగ్యం, పశువులకు, పంట పొలాలకు సూర్య రశ్మి ఎంతో అవసరం.

**దైవాజ్ఞ మేరకు దైవప్రజల కొరకు సూర్యుడు పనిచేసిన సందర్భాలు :**

**1. యెహోషువా 10 : 12,13** యెహోవా ఇశ్రాయేలీయుల యెదుట అమోరీయులను అప్పగించిన దినమున, ఇశ్రాయేలీయులు వినుచుండగా యెహోషువా యెహోవాకు ప్రార్థన చేసెను – సూర్యుడా, నీవు గిబియోనులో నిలువుము. చంద్రుడా, నీవు అయ్యాలోను లోయలో నిలువుము. జనులు తమ శత్రువులమీద పగతీర్చుకొనువరకు సూర్యుడు నిలిచెను చంద్రుడు ఆగెను. అను మాట యాషారు గ్రంథములో వ్రాయబడి యున్నది గదా. [13] సూర్యుడు ఆకాశమధ్యమున నిలిచి యించు మించు ఒక నాడెల్ల అస్తమింప త్వరపడలేదు.

**2. 2 రాజులు 3 : 22** ఉదయమందు వీరు లేచినప్పుడు సూర్యుడు నీళ్లమీద ప్రకాశింపగా, అవతలి నీళ్లు మోయాబీయులకు రక్తమువలె కనబడెను.

**3. యెషయా 38 : 8** అహాజు ఎండ గడియారము మీద సూర్యుని కాంతిచేత దిగిన నీడ మరల పదిమెట్లు ఎక్క జేసెదను. అప్పుడు సూర్యకాంతి దిగిన మెట్లలో అది పది మెట్లు మరల ఎక్కెను.

**సూర్యుని క్రింద ఏమేమి జరుగుచున్నవి? :**

**1. నూతనమైనదేదియు లేదు : ప్రసంగి 1 : 9** మునుపు ఉండినదే ఇక ఉండబోవునది; మునుపు జరిగినదే ఇక జరుగబోవునది; సూర్యుని క్రింద నూతనమైన దేదియు లేదు.

**2. లాభకరమైనదేదియు లేదు : ప్రసంగి 2 : 11** అప్పుడు నేను చేసిన పనులన్నియు, వాటికొరకై నేను పడిన ప్రయాసమంతయు నేను నిదానించి వివేచింపగా అవన్నియు వ్యర్థమైనవిగాను ఒకడు గాలికి ప్రయాసపడినట్టుగాను అగుపడెను, సూర్యుని క్రింద లాభకరమైనదేదియు లేనట్టు నాకు కనబడెను.

**3. వ్యసనము పుట్టించునది : ప్రసంగి 2 : 17 – 20** ఇది చూడగా సూర్యుని క్రింద జరుగునది నాకు వ్యసనము పుట్టించెను – అంతయు వ్యర్థముగాను ఒకడు గాలికై ప్రయాసపడినట్టుగాను కనబడెను గనుక. బ్రదుకుట నాకసహ్యమాయెను. [18] సూర్యుని క్రింద నేను ప్రయాసపడి చేసిన పనులన్నిటిని నా తరువాత వచ్చువానికి నేను విడిచి పెట్టవలెనని తెలిసి కొని నేను వాటియందు అసహ్యపడితిని. [19] వాడు జ్ఞానము గలవాడైయుండునో బుద్ధి హీనుడైయుండునో అది ఎవనికి తెలియును? అయితే సూర్యుని క్రింద నేను ప్రయాస పడి జ్ఞానముచేత సంపాదించుకొన్న నా కష్టఫలమంతటి మీదను వాడు అధికారియై యుండును; ఇదియును వ్యర్థమే. [20] కావున సూర్యుని క్రింద నేను పడిన ప్రయాస మంతటి విషయమై నేను ఆశ విడిచిన వాడనైతిని.

**4. అన్యాయ క్రియలు : ప్రసంగి 4 : 1 – 3** పిమ్మట సూర్యునిక్రింద జరుగు వివిధమైన అన్యాయ క్రియలను గురించి నేను యోచించితిని. బాధింపబడు వారు ఆదరించు దిక్కులేక కన్నీళ్లు విడుచుదురు; వారిని బాధపెట్టువారు బలవంతులు గనుక ఆదరించువాడెవడును లేకపోయెను. [2] కాబట్టి యింకను బ్రదుకుచున్న వారి కంటె ఇంతకుముందు కాలము చేసినవారే ధన్యులనుకొంటిని. [3] ఇంకను పుట్టనివారు సూర్యునిక్రింద జరుగు అన్యాయపు పనులు చూచియుండని హేతువుచేత ఈ ఉభయులకంటెను వారే ధన్యులనుకొంటిని.

**5. వ్యర్థమైనది : ప్రసంగి 4 : 7** నేనాలోచింపగా వ్యర్థమైనది మరియొకటి సూర్యుని క్రింద నాకు కనబడెను.
**ప్రసంగి 8 : 14** వ్యర్థమైనది మరియొకటి సూర్యునిక్రింద జరుగుచున్నది, అదేమనగా భక్తిహీనులకు జరిగినట్లుగా నీతిమంతులలో కొందరికి జరుగుచున్నది; నీతిమంతులకు జరిగినట్లుగా భక్తిహీనులలో కొందరికి జరుగుచున్నది; ఇదియును వ్యర్థమే అని నేననుకొంటిని.

**6. ఆయాసకరమైనది : ప్రసంగి 5 : 13** సూర్యుని క్రింద మనస్సునకు ఆయాసకరమైనదొకటి జరుగుట నేను చూచితిని. అదేదనగా ఆస్తిగలవాడు తన ఆస్తిని దాచిపెట్టుకొని తనకు నాశనము తెప్పించుకొనును.

**7. దురవస్థ : ప్రసంగి 6 : 1** సూర్యుని క్రింద దురవస్థ యొకటి నాకు కనబడెను, అది మనుష్యులకు బహు విశేషముగా కలుగుచున్నది.

**8. బహు దు:ఖకరమైనది : ప్రసంగి 9 : 3** అందరికిని ఒక్కటే గతి సంభవించును, సూర్యునిక్రింద జరుగువాటన్నిటిలో ఇది బహు దు:ఖకరము, మరియు నరుల హృదయము చెడుతనముతో నిండియున్నది, వారు బ్రదుకుకాలమంతయు వారి హృదయమందు వెఱ్ఱితనముండును, తరువాత వారు మృతుల యొద్దకు పోవుదురు ఇదియును దు:ఖకరము.

## సూర్యోదయము మనకు ఏమి నేర్పిస్తుంది ? :

**నిర్గమ 22 : 2,3** దొంగ కన్నము వేయుచుండగా వాడు దొరికి చచ్చునట్లు కొట్టబడినయెడల అందువలన రక్తాపరాధముండదు. [3] సూర్యుడు ఉదయించిన తరువాత వాని కొట్టినయెడల వానికి రక్తాపరాధముండును; వాడు సరిగా సొమ్ము మరల చెల్లింపవలెను. వానికేమియు లేకపోయినయెడలవాడు దొంగతనము చేసినందున అమ్మబడవలెను.

**కీర్తనలు 104 : 22** సూర్యుడు ఉదయింపగానే అవి(సింహపు పిల్లలు) మరలిపోయి తమ గుహలలో పండుకొనును

**మత్తయి 13 : 6** సూర్యుడు ఉదయించినప్పుడు అవి(రాతి నేలను పడిన విత్తనములు) మాడి వేరులేనందున ఎండిపోయెను.

## సూర్యాస్తమయము మనకు ఏమి నేర్పిస్తుంది ? :

**నిర్గమ 22 : 26** నీవు ఎప్పుడైనను నీ పొరుగువాని వస్త్రమును కుదవగా తీసికొనినయెడల సూర్యుడు అస్తమించు వేళకు అది వానికి మరల అప్పగించుము.

**ఎఫెసీ 4 : 26** కోపపడుడి గాని పాపము చేయకుడి; సూర్యుడస్తమించువరకు మీ కోపము నిలిచియుండకూడదు.

## దేవుణ్ని సూర్యునితో పరిశుద్ధ గ్రంథం పోల్చుట :

**1. కీర్తనలు 84 : 11** దేవుడైన యెహోవా సూర్యుడును కేడెమునై యున్నాడు యెహోవా కృపయు ఘనతయు అనుగ్రహించును యథార్థముగా ప్రవర్తించువారికి ఆయన యే మేలును చేయక మానడు.

**2. మలాకీ 4 : 2** అయితే నా నామమందు భయభక్తులుగలవారగు మీకు నీతి సూర్యుడు ఉదయించును; అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయును గనుక మీరు బయలుదేరి క్రొవ్వినదూడలు గంతులు వేయునట్లు గంతులు వేయుదురు.

**మత్తయి 17 : 2** ఆయన ముఖము సూర్యునివలె ప్రకాశించెను; ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లనివాయెను.

**ప్రకటన 1 : 16** ఆయన తన కుడిచేత ఏడు నక్షత్రములు పట్టుకొని యుండెను; ఆయన నోటినుండి రెండంచులుగల వాడియైన ఖడ్గమొకటి బయలు వెడలుచుండెను; ఆయన ముఖము మహా తేజస్సుతో ప్రకాశించుచున్న సూర్యునివలె ఉండెను.

## యేసు ప్రభువు రాకడ గురుతుగా ఉన్న సూర్యుడు :

**1. యెషయా 24 : 23** చంద్రుడు వెలవెలబోవును సూర్యుని ముఖము మారును సైన్యములకధిపతియగు యెహోవా సీయోను కొండ మీదను యెరూషలేములోను రాజగును. పెద్దలయెదుట ఆయన ప్రభావము కనబడును.

**2.యోవేలు 2 : 31** యెహోవా యొక్క భయంకరమైన ఆ మహాదినము రాకముందు సూర్యుడు తేజోహీనుడగును, చంద్రుడు రక్తవర్ణమగును.

**3. మత్తయి 24 : 29** ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతిని ఇయ్యడు, ఆకాశమునుండి నక్షత్రములు రాలును, ఆకాశమందలి శక్తులు కదలింపబడును.

**4. ప్రకటన 6 : 12** ఆయన ఆరవ ముద్రను విప్పినప్పుడు నేను చూడగా పెద్ద భూకంపము కలిగెను. సూర్యుడు కంబళివలె నలుపాయెను, చంద్రబింబమంతయు రక్తవర్ణమాయెను.

**5. ప్రకటన 8 : 12** నాలుగవ దూత బూర ఊదినప్పుడు సూర్య చంద్ర నక్షత్రములలో మూడవభాగము చీకటి కమ్మునట్లును, పగటిలో మూడవభాగమున సూర్యుడు ప్రకాశింపకుండునట్లును, రాత్రిలో మూడవభాగమున చంద్ర నక్షత్రములు ప్రకాశింపకుండునట్లును వాటిలో మూడవభాగము కొట్టబడెను.

**6. ప్రకటన 9 : 2** అతడు అగాధము తెరవగా పెద్ద కొలిమిలోనుండి లేచు పొగవంటి పొగ ఆ అగాధములోనుండి లేచెను; ఆ అగాధములోని పొగచేత సూర్యునిని వాయుమండలమున చీకటి కమ్మెను.

**7. ప్రకటన 16 : 8** నాలుగవ దూత తన పాత్రను సూర్యునిమీద కుమ్మరింపగా మనుష్యులను అగ్నితో కాల్చుటకు సూర్యునికి అధికారము ఇయ్యబడెను.

**హెచ్చరిక : యెహెజ్కేలు 8 : 16** యెహోవా మందిరపు లోపలి ఆవరణములో నన్ను దింపగా, అక్కడ యెహోవా ఆలయ ద్వారము దగ్గరనున్న ముఖమంటపమునకును బలిపీఠమునకును మధ్యను ఇంచుమించు ఇరువదియయిదు గురుమనుష్యులు కనబడిరి. వారి వీపులు యెహోవా ఆలయముతట్టును వారి ముఖములు తూర్పుతట్టును తిరిగి యుండెను; వారు తూర్పున నున్న సూర్యునికి నమస్కారము చేయుచుండిరి.

**సూర్యునికి నమస్కరించువారికి శిక్ష : ద్వితీయ 17 : 2,3,4** నీ దేవుడైన యెహోవా నిబంధనను మీరి ఆయన దృష్టికి చెడ్డదానినిచేయుచు, నేనిచ్చిన ఆజ్ఞకు విరోధముగా అన్యదేవతలకు, అనగా సూర్యునికైనను చంద్రునికైనను ఆకాశ నక్షత్రములలోని దేనికైనను నమస్కరించి మ్రొక్కు పురుషుడేగాని స్త్రీయేగాని నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న నీ గ్రామములలో దేనియందైనను నీ మధ్య కనబడినప్పుడు [3] అది నీకు తెలుపబడిన తరువాత నీవు విని బాగుగా విచారణచేయవలెను. అది నిజమైనయెడల, అనగా అట్టి హేయక్రియ ఇశ్రాయేలీయులలో జరిగియుండుట వాస్తవమైనయెడల. [4] ఆ చెడ్డ కార్యము చేసిన పురుషునిగాని స్త్రీనిగాని నీ గ్రామముల వెలుపలికి తీసికొనిపోయి రాళ్లతో చావగొట్టవలెను.

**ముగింపు :** దేవాలయమువైపు తిరిగి నమస్కరించవలసిన దైవ ప్రజలు తమ వీపులను దేవాలయము వైపు త్రిప్పి తమ ముఖములను సూర్యునివైపు త్రిప్పుకొని సూర్యునికి నమస్కారము చేయటము బహు శోచనీయం. ఆ నీతి సూర్యుడు సిలువలో అస్తమిస్తుండగా ఈ లోక సూర్యుడు దానిని చూడలేక 3 గంటలకే అస్తమించాడు. నీ జీవితంలో ఏ సూర్యుని వెలుగు కావాలి? ఏ సూర్యుని వలన కలుగు శ్రేయస్కరమైన ఆశీర్వాదాలు కావాలో నిర్ణయించుకోవలసిన సమయము ఇది. మనము దేవునివైపు తిరుగుటకు ఈ లెంట్ అనుకూలమైనదని జ్ఞాపకము చేస్తున్నాను. అలాంటి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకు దయచేయును గాక. ఆమేన్.